సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



సంబరంగా..


సంబరం అంబరాన్ని తాకింది. రంగరాయ రారాజై వెలుగులీనింది. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. - 8లో



వ్యాన్‌ను ఢీకొని ఇద్దరి మృతి

గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. - 8లో

1.62 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 1.62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్


హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత



శ్యామ్‌కు సాయం అందిస్తున్న శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అల్లవరం మండలం బోడసకుర్రుపాలేనికి చెందిన **కడలి శ్యామ్ అనారోగ్యానికి గురై అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో** చికిత్స పొందుతున్నాడు. **అతనికి శెట్టిబలిజ** హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యు**లు రూ.40 వేలు,** హైదరాబాద్ గుత్తుల మీరాకుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 వేలు ఇచ్చారు. శెట్టిబలిజ సామాజిక వర్గ పెద్దలు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి బాబు, పిల్లి గంగాధర్, గొవ్వాల రాజేష్, సంసాని బులి నాని, విత్తనాల శేఖర్, కముజు రమణ తదితరులు ఆర్థిక సాయాన్ని అందించిన వారిలో ఉన్నారు.

జిల్లాకు పోలీస్ 'బెస్ట్ కేసు డెడికేషన్' అవార్డు



డీజీపీ తిరుమలరావు నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: రామచంద్రపురం సబ్ డివిజన్ పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో అత్యున్నత ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరస్తులకు త్వరితగతిన శిక్ష పడేలా చేసిన ఘటన అవార్డు ఫర్ బెస్ట్ కేసు డెడికేషన్ (ఏబీసీడీ)కు ఎంపికైంది. ఈ అవార్డును మంగళగిరిలో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, రామచంద్రపురం సబ్ డివిజన్, సర్కిల్ పోలీసు అధికారులు అందుకున్నారు. జిల్లా ఎస్పీతో పాటు ఈ కేసులో శ్రమించిన రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్సై ఎస్కే జానీ బాషా అవార్డులు, నగదు రివార్డులు అందుకున్నారు. పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం కేసును అప్పటి జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో సాగిన ఉత్తమ దర్యాప్తునకు కూడా కన్సొలేషన్ బహుమతి లభించింది. అలాగే ఈ కేసు డిటెక్షన్‌లో కీలకంగా వ్యవహరించిన డాగ్ స్క్వాడ్‌కు, డాగ్‌కు అవార్డులను అందజేసి అభినందించారు. ఈ అవార్డులు తీసుకోవడం పట్ల జిల్లా ఏఎస్పీ ప్రసాద్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సర్టిఫికెట్లు పోతే ఇలా చేయండి

అమలాపురం టౌన్: జిల్లాలో రెండు నెలల్లో కురిసిన వర్షాలు, సంభవించిన వరదలకు కొన్ని ప్రాంతాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు సర్టిఫికెట్లు పోగొట్టుకున్నట్లు ఇంటర్ విద్యా మండలి దృష్టికి వచ్చిందని డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) వనుము సోమశేఖరరావు తెలిపారు. విద్యార్థులు ఎవరైనా సర్టిఫికెట్లు పోగొట్టుకుంటే వారి ఆధార్ కార్డు నకలు, సర్టిఫికెట్ నంబర్ తదితర వివరాలతో దరఖాస్తును డీఐఈఓకు గాని, ఇంటర్ బోర్డు ప్రాంతీయ విద్యా అధికారికి గాని సమర్పించాలని సూచించారు. ఏ విధమైన రుసుము లేకుండా ఉచితంగా విద్యార్థులకు డూప్లికేట్ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

సిండికేట్లకే.. అండదండలు



- మద్యం షాపులు పొందేందుకు యత్నాలు
- పావులు కదుపుతున్న టీడీపీ నేతలు
- టెండర్లు ఎవరు వేయాలనే దానిపై చర్చలు



మద్యం షాపు

సాక్షి, అమలాపురం: విచ్చలవిడిగా తాగించాలి.. భారీగా ట్యాక్స్‌లు వేయాలి.. మద్యం మీద భారీగా ఆదాయం పొందాలని ప్రభుత్వం ఒకవైపు ఆలోచిస్తుండగా, మరోవైపు మద్యం దుకాణాలు మనవాళ్లకే రావాలి. వారంతా సిండికేట్ కావాలి. ఇది టీడీపీ, దాని మిత్రపక్షమైన జనసేన నేతల కుయుక్తి. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా మద్యం షాపుల వేలం ధరావత్తు, ట్యాక్స్ పెంచగా, ఆశావహులను సిండికేట్ చేసే పనిలో టీడీపీ నేతలు పడ్డారు. దుకాణాలు ఖరారైన తరువాత తమ వాటా తేల్చేందుకు లెక్కలు వేస్తున్నారు.

కూటమి ప్రభుత్వ కొత్త మద్యం పాలసీ వచ్చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం 133 మద్యం షాపులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఈ నెల 11న అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్‌లోని దుకాణాలకు సంబంధించి లాటరీ నిర్వహించనున్నారు. దుకాణాలు దక్కించుకునేందుకు రూ.రెండు లక్షల డీడీ చెల్లించాల్సి ఉంది. అలాగే దుకాణానికి ఏడాదికి ఆరు దఫాలుగా రూ.62.50 లక్షల చెల్లించాల్సి వస్తోంది. అయినప్పటికీ సిండికేట్‌దారులు వెనకడుగు వేయడం లేదు. మద్యం దుకాణాలు పొందిన వారిని సిండికేట్ చేయడంలో టీడీపీలో కొంతమంది సిద్ధహస్తులు ఉన్నారు. కొందరు మండలాల వారీగా, మరి కొంతమంది ఏకంగా నియోజకవర్గాల వారీగా సిండికేట్ చేస్తుంటారు. వారంతా రంగంలోకి దిగారు. గడిచిన పదిహేను రోజులుగా చర్చల మీద చర్చలు చేస్తున్నారు. అప్లికేషన్ ధర రూ.రెండు లక్షల వరకూ ఉండడంతో చాలా తక్కువ మంది వచ్చే అవకాశముంది. ఇందులో గతంలో మద్యం వ్యాపారం చేసినవారు కావడంతో దుకాణాల వారీగా ఎవరు డీడీలు చెల్లించాలనేది సిండికేట్‌దారులకు సులువుగా మారింది. ఎవరైనా కొత్తవారికి తగిలితే వారిని కూడా కలిపేసుకుంటున్నారు. వారు వినకుంటే ఆ మండలాల్లో ధరలు తగ్గించి అమ్మకాలు చేయడం ద్వారా శంకరగిరిమాన్యాలు పట్టిస్తారు. మద్యం షాపుల ఎక్సైజ్ ట్యాక్స్ కూడా భారీగా ఉండడంతో బయట వారు వచ్చే అవకాశం లేదని ఒక అంచనాతో సిండికేట్‌దారులు చెలరేగిపోతున్నారు.

టీడీపీ నేతల కనుసన్నల్లోనే..

మద్యం వ్యాపారంపై ఆశావహులు టీడీపీ నేతల ఆధ్వర్యంలో సిండికేట్‌గా ఏర్పడేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు తమ ముఖ్య అనుచరులను రంగంలోకి దింపారు. నియోజకవర్గాల్లో అధిక ఆదాయం వచ్చే బెల్ట్ షాపులకు ఫలానా షాపు.. ఫలానా పార్టీ తృతీయ శ్రేణి నాయకులకు ఇచ్చేలా భరోసా అందించారు. రామచంద్రపురంలో దుకాణాలన్నీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అనుచరుడు ఆధ్వర్యంలో సిండికేట్‌గా ఏర్పడేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో మద్యం దుకాణదారులను సిండికేట్ చేసి వాటి మీద కొంత మొత్తం చొప్పున వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు సమాచారం. కొత్తపేట నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకునేందుకు మద్యం సిండికేట్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయి. టీడీపీకి చెందిన వ్యక్తులు బృందంగా ఏర్పడి మద్యం షాపులను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఆశావహులు సైతం వ్యక్తిగతంగా షాపులకు దరఖాస్తు చేసుకుంటూనే టీడీపీకి చెందిన బడాబాబులు సిండికేట్‌లో చేరాలని ఒక అంచనాకు వచ్చారు. కొత్తపేట మండలంలో ఎనిమిది షాపులు కాగా స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు ఏర్పాటు చేస్తున్న సిండికేట్ చేరాలని ఒక అంచనాకు వచ్చారు. ఆత్రేయపురం మండలంలో నాలుగు షాపులు నోటిఫై చేశారు. రావులపాలేనికి చెందిన ఇద్దరు, ఆత్రేయపురం గ్రామానికి చెందిన ఒక టీడీపీ నేత సిండికేట్ చేస్తున్నారు. వీరంతా గతంలో మద్యం వ్యాపారం చేసిన సిద్ధహస్తులు. ఆలమూరు మండలంలోని ఐదు మద్యం దుకాణాల విషయంలో ఇంకా చర్చలు కొలిక్కి రాలేదు. అమలాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులే టెండర్లు వేస్తున్నారు. నాయకులు సిండికేట్‌గా అవుతున్నారు. సగం షాపులు తమకు వచ్చేలా చూడాలని జనసేన నేతలు పట్టుబడుతున్నారు. టీడీపీ నేతలకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అండదండలు ఉన్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో తీర ప్రాంత గ్రామాల్లో మద్యం అధిక అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ దుకాణాలు టీడీపీ అనుచరులకు దక్కేలా ఒక కీలక టీడీపీ నేత ప్రయత్నాలు ప్రారంభించారు. వీరందనీ సిండికేట్ చేయడం ద్వారా ఆదాయ మార్గాలు పెంచుకోనున్నారు. జిల్లాలో మండపేట, రాజోలు, పి.గన్నవరంలో ఎవరికి వారుగా దుకాణాలకు డీడీలు తీస్తున్నారు. ఇక్కడ దుకాణాలు కేటాయించిన తరువాత సిండికేట్‌గా ఏర్పడే అవకాశముంది.

రైస్‌మిల్లుల ర్యాండమైజేషన్ రద్దు: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా రైస్ మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసిందని జేసీ టి.నిషాంతి తెలిపారు. శనివారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ జి.వీర పాండియన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ అమరావతి నుంచి వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం అమలు చేయనున్న విధి విధానాలపై వారు వివరించారు. అమలాపురం కలెక్టర్ నుంచి జేసీ పాల్గొని అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. ఇకపై రైతులు సమీపంలోని తమకు నచ్చిన మిల్లులకే ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. అందుకు అవసరమైన రవాణా వాహనాలు, గోనె సంచులను సమకూర్చడంతో పాటు ధాన్యం ఎగుమతి, దిగుమతులకు అయ్యే లేబర్ చార్జీలను చెల్లించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. తేమ శాతం 17గా నమోదైతే క్వింటాలు ధాన్యానికి తరుగు ఉండదని, తేమ శాతం 18గా ఉంటే కిలో తరుగు, 19 శాతానికి రెండు కిలోలు, 20 శాతానికి మూడు, 21 శాతానికి నాలుగు, 22 శాతానికి ఆ పైబడి ఉన్న ధాన్యానికి క్వింటాలుకు ఐదు కిలోల తరుగుగా నిర్దేశించారన్నారు. చౌకధరల దుకాణాలకు సంబంధించి మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ల పనితీరుపై తనిఖీ చేయాలని డీఎస్ఓ ఉదయభాస్కర్‌ను ఆమె ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ సహాయ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన అప్పనపల్లి



స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించేందుకు బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: దసరా సెలవులు కావడంతో అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామివారి సన్నిధిలో లక్ష్మీ నారాయణ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2.73 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.14 లక్షలు సమకూరారు. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.59,299 విరాళాలు వచ్చాయి. 4,686 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 3,578 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

పచ్చని కోనసీమలో బతుకమ్మ సంబరాలు అలరించాయి. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అని పాడుతూ యువతులు సందడి చేశారు. ఐ.పోలవరం మండలం మురమళ్లలోని అప్పన్నచెరువు గట్టు వద్ద వేంచేసి ఉన్న విజయదుర్గమ్మ దసరా మహోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి బతుకమ్మలను అమ్మవారి వద్ద ఉంచి ఆడిపాడారు. సంప్రదాయ దుస్తుల్లో రంగుల బతుకమ్మలతో సందడి చేశారు. - ఐ.పోలవరం



బతుకమ్మలతో సందడి చేస్తున్న యువతులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బాబీ సింగ్‌ను సత్కరిస్తున్న జిల్లా బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు

అమలాపురం టౌన్: పౌష్టికాహారం, నిండైన నిద్ర, నిత్య వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, బాడీ బిల్డింగ్ క్రీడాకారుడిగా రాణిస్తారని ప్రపంచ బాడీ బిల్డింగ్ విజేత బాబీ సింగ్ అన్నారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సత్కార కార్యక్రమానికి బాబీ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా బాడీ బిల్డింగ్ ప్యానల్‌తో ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా స్వామి రమేష్ కుమార్ ఎంపిక పట్ల బాబీ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు మాట్లాడుతూ ఎనిమిది సార్లు ప్రపంచ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా నిలిచిన మణిపూర్ రాష్ట్రానికి చెందిన బాబీ సింగ్ అమలాపురం రావడం ఇక్కడి క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. అనంతరం బాబీ సింగ్‌ను సత్కరించారు. రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వాడపల్లి శ్రీనివాసరాజు, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరావు, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ల ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మాతా ప్రణామం.. సదా నీ స్మరణం



అన్నపూర్ణా దేవి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో మూడో రోజు శనివారం మాణిక్యాంబ అమ్మవారి మట్టి ప్రతిమను అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. పూజల అనంతరం లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

సాయం... అయోమాయం



వరి పంటను కోస్తున్న కూలీలు

- కూటమి సర్కారు నుంచి రైతులకు దక్కని భరోసా
- 'అన్నదాత సుఖీభవ' అమలుపై మీనమేషాలు
- కేంద్రం నుంచి పీఎం కిసాన్ రెండో విడత సాయం జమ

జిల్లాలో సాగు వివరాలు

ఖరీఫ్ విస్తీర్ణం	1,58 లక్షల ఎకరాలు
వరి సాగు రైతులు	95,645
పీఎం కిసాన్ లబ్ధిదారులు	1,22,279
రైతు భరోసా కేంద్రాలు	515



ఖరీఫ్‌లో యంత్రంతో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతు

ఆలమూరు: కడుపు నింపే అన్నదాతకూ ఆకలి కేకలు తప్పడం లేదు.. ఆరుగాలం శ్రమిస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస భరోసా అందడం లేదు.. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు నష్టాలు తెస్తుంటే, మరోవైపు ఇచ్చిన హామీలను కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పంట సాయం అందిస్తామన్న చంద్రబాబు ఇప్పుడా ఊసెత్తడం లేదు. అన్నదాతను ఆదుకుంటామన్న మాట నీటిమూటగానే మిగిలింది.

గత వైఎస్సార్ సీపీ సర్కారులో పుడమి పుత్రులకు సాగు బంగారమైంది. అన్నింటా సాయం దక్కింది. రైతు భరోసా పథకం ద్వారా ఏటా మూడు విడతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.13,500 సాయం అందేది. కేంద్ర ప్రభుత్వం మూడు విడతలు రూ.ఆరు వేలు, రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలు రూ.7500 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా పంట సాయం జమ చేసేది. ఇదంతా గతం. ఈ తరుణంలో గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు పంట సాయాన్ని రూ.13,500 నుంచి రూ.20 వేలకు పెంచుతానని హామీ ఇచ్చాయి. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి మూడు నెలలు పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే పంట పెట్టుబడి పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి కంటనీరు రప్పిస్తుంది.

ఎదురుచూపులే మిగిలాయి..

జిల్లాలోని 22 మండలాల్లో 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి 1,58,129 ఎకరాల్లో 95,645 మంది రైతులు వరి సాగు చేపట్టారు. ఇందులో పీఎం కిసాన్ పథకానికి 1,22,279 మంది అర్హత పొందారు. ఈ ఏడాది జూన్ 18న రూ.2 వేల చొప్పున రూ.24.46 కోట్లు ఇవ్వగా, రెండో విడతగా శనివారం రూ.22.45 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందించాల్సిన సాయంపై నోరుమెదపడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలను సత్వరమే అందించాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెరిగిన ఖర్చు.. అందని సాయం

వరి పంటకు మద్దతు ధర పెరగకపోగా, పెట్టుబడి మాత్రం ప్రతి సీజన్‌లోనూ అధికమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కచ్చితంగా రైతు భరోసా పథకం ద్వారా పంట సాయం అందడంతో పెట్టుబడికి ఇబ్బంది ఉండేది కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సాయంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా వరి సాగు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని పూర్తిగా విస్మరించింది. రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. ఈ ఖరీఫ్‌లో ఎకరా వరి సాగుకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ ఖర్చు అవుతుంది. ప్రస్తుత ప్రభుత్వం అనాలోచిత వైఖరితో వరి రైతులకు సాగు కష్టమవుతుంది. కూటమి ప్రభుత్వం రెండు విడతల పంట సాయం మంజూరు చేయకపోవడంతో జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులు రూ.114.26 కోట్లోయారు. ఇప్పటికైనా తమ మొర ఆలకించాలని వారు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నదాత సుఖీభవ పథకంపై చర్యలు తీసుకుంటాం. ఈ పథకం విధి విధానాలు ఖరారైన తరువాత తదుపరి కార్యాచరణ అమలు చేస్తాం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సాయం రెండో విడత సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

- ఓలేటి బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి, అమలాపురం

ఎప్పుడు అమలు చేస్తారో..!



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి. అర్హులైన రైతులందరి ఖాతాలో రూ.20 వేలు జమ చేసి ఆదుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయి ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు సాయం అందక అవస్థలు ఎదుర్కొంటున్నాం.

- తోరాటి పెంటయ్య, రైతు, సంధిపూడి

క్లుప్తంగా

అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా సతీష్



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా యాతం సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కాకినాడలో ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా బాలకృష్ణ, సహాయ ఎన్నికల అధికారులుగా గణేష్, సప్తగిరి, పి.వి.వి.సత్యనారాయణ వ్యవహరించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ దొర, కార్యదర్శిగా జి.వి.మోహన్, జాయింట్ సెక్రటరీగా ఆకుల నరేష్‌కుమార్, కోశాధికారిగా వి.సుబ్రహ్మణ్యం, సలహాదారుగా కె.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి జిల్లా అగ్నిమాపక అధికారి వి.సుబ్బారావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కేఎస్ఎన్ మూర్తి, డీఎల్ నారాయణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

అడ్డుకున్న గ్రామస్తులు



సుభద్రపాలెంలో గ్రామస్తులు నిలుపుదల చేసిన ట్రాక్టర్లు

నల్లజర్ల: మండలంలోని సుభద్రపాలెం శివారులో ఉన్న ఎర్రకాలువ నుంచి శనివారం రాత్రి టీడీపీ నేతలు ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు. ఇది గమనించిన గ్రామస్తులు ఈ అక్రమ రవాణాను అడ్డుకున్నారు. గ్రామంలోకి వచ్చిన రెండు ఇసుక లోడు ట్రాక్టర్లను నిలుపుదల చేశారు. మిగతా ట్రాక్టర్లు వెనుతిరిగి వెళ్లిపోయాయి. ఇసుక అక్రమ రవాణా విషయాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలియజేసినా ఎవరూ స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఎర్రకాలువకు వచ్చిన వరదలకు ఈ ప్రాంతంలో ఇసుక నిక్షేపాలు భారీగా వచ్చి చేరాయి. దీనిపై పోతవరం పరిసర ప్రాంతానికి చెందిన టీడీపీ నేతలు కన్నేశారు. ఇసుక ఎగుమతికి స్థానికంగా ఉన్న ట్రాక్టర్లు, బంటా కూలీలు రాకపోవడంతో రాజవరం నుంచి తీసుకువచ్చి ఈ అక్రమ రవాణాకు తెరతీశారు. రాత్రి 9 దాటినా అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో ఆ ట్రాక్టర్ల వద్ద గ్రామస్తులే పహారా కాస్తున్నారు.

సంబరంగా..

- మిన్నంటిన రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం
- తరలివచ్చిన అతిరథులు, పూర్వ విద్యార్థులు

కాకినాడ క్రైం: సంబరం అంబరాన్ని తాకింది. రంగరాయ రారాజై వెలుగులీనింది. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఈ కళాశాల 66వ వార్షికోత్సవాన్ని ఆద్యంతం కనుల పండువగా నిర్వహించారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలది 66 ఏళ్ల అప్రతిహత యశస్సు అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ కొనియాడారు. ఎందరో వైద్య ప్రముఖులు, నేతలు, అధినేతలను దేశానికి అందించిన ఘనకీర్తి రంగరాయదని కీర్తించారు. 1958లో ఓ ప్రైవేట్ కళాశాలగా స్థాపించబడి, 1959లో జిల్లా ఆసుపత్రికి అనుసంధానం అయ్యిందన్నారు. 1977లో ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. 184 వైద్య కళాశాలల అనుబంధ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ టాపర్‌గా రంగరాయ వైద్య కళాశాల విద్యార్థి డాక్టర్ ఎ.సాయి అనిరుధ్ నిలవడం గర్వకారణమని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రాష్ట్ర డీఎంఈ, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన డాక్టర్ ఎ.సాయి అనిరుధ్ వివిధ విభాగాలలో ఐదు బంగారు పతకాలు, మరో నాలుగు అవార్డులు సాధించి రంగరాయ వైద్య కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారని ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్స్ డాక్టర్ డీఏవీఎస్ శశి అన్నారు. డాక్టర్ చంద్రాభట్ల పార్వతి 7 అవార్డులు సాధించి రెండో స్థానంలో నిలిచారన్నారు.

జాతీయ సదస్సులకు వేదిక

జాతీయ వైద్య విజ్ఞాన సదస్సులకు రంగరాయ వైద్య కళాశాల వేదికగా నిలిచిందని అవిఘ్న ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ కె.శైలజ అన్నారు. అనాటమీ విభాగం ప్రతిష్ఠాత్మక జర్నల్స్‌లో 7 పరిశోధనా పత్రాలు సమర్పించిందన్నారు. కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ నరసింహంతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ బి.దేవి మాధవి, స్నేహ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామస్వరూప్ జవహర్ హాజరయ్యారు. దేశానికి వైద్య ఉద్దండుల్ని అందించిన కళాశాల ఆర్ఎంసీ అని కీర్తించారు. డాక్టర్ నరసింహం చేతుల మీదుగా టాపర్లకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



టాపర్‌లకు పతకాలు అందిస్తున్న డాక్టర్ నరసింహం, అతిథులు

సమర్థ నిర్వహణతోనే ఘనత



డాక్టర్ విష్ణువర్ధన్ బృందం రంగరాయ కార్యకలాపాలను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కళాశాల నిర్వహణలో రాజీ లేని విధానం విద్యార్థుల భవితకు ఎంతో మేలు చేస్తుంది. విద్యతో పాటు సామాజిక బాధ్యత, రోగులతో మసలుకోవాల్సిన తీరు, పరిశోధన, పరిశీలన అంశాలపై విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నాం.

– నరసింహం, ఎన్టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్

'రంగరాయ' ఓ బ్రాండ్



దేశ, విదేశాల వైద్య యవనికపై రంగరాయ ఓ తిరుగులేని బ్రాండ్. ఆర్ఎంసీలో చదువుకుని ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారున్నారు. దేశం దాటి విదేశాల్లో రంగరాయ కీర్తిని ఇనుమడింపజేసిన ఘనత వారిది. ప్రత్యేక బోధనా శైలి, బోధకుల అపార పరిజ్ఞానం రంగరాయ వైద్య విద్యకు మణి మకుటాలు.

– ఎ.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్, ఆర్ఎంసీ, అవిఘ్న ఆర్గనైజింగ్ కమిటీ

నా విజయం రంగరాయదే



రంగరాయ వైద్య విద్యార్థిగా గర్విస్తున్నా. కళాశాల కేవలం విద్యనే కాదు సమాజంలో నడవడికను, వైద్య విద్య గొప్పతనాన్ని, విద్యను సమాజం కోసం వినియోగించాల్సిన ఆవశ్యకతను బోధించింది. నా విజయం కళాశాలది, గురువులది. యూనివర్సిటీ టాపర్‌గా, 9 అవార్డులు, 5 బంగారు పతకాల సాధకుడిగా కంటే రంగరాయన్‌గా నేను గర్విస్తున్నా.

– అనిరుధ్, ఆర్ఎంసీ విద్యార్థి, ఎన్టీఆర్ యూహెచ్ఎస్ టాపర్

కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ



రోళ్లపాలెం కొబ్బరి తోటలో దొంగలు వదిలేసిన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: రోళ్లపాలెంలోని బుడగ జంగాల కాలనీ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. ఆలయంలోని హుండీని దొంగిలించి అందులోని కరెన్సీ నోట్లను తీసుకుని, చిల్లర నాణేలు, ఖాళీ హుండీని సమీప తోటలో వదిలేసి వెళ్లిపోయారు. అయితే హుండీపై రక్తపు మరకలు ఉండడంతో దానిని బద్దల కొట్టే సమయంలో దొంగల చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారుజామున కాలనీవాసులు శరన్నరాత్ర ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయం వద్దకు వచ్చేసరికి ఆలయం తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు వచ్చి ఆలయాన్ని, హుండీ పడి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి నిందితుల వేలి ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. సీఐ పి.వీరబాబు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సంఘటనా స్థలం వద్ద ఆనంద్ మృతదేహం

కె.గంగవరం: మండలంలోని కోట గ్రామ పరిధిలో ఏటిగట్టుపై ఉన్న వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొజు ఆనంద్ (20) మృతి చెందాడు. ఎస్సై జానీబాషా కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని కొత్తపేట వీధికి చెందిన కొజు ఆనంద్ తన స్నేహితుడితో కలసి శుక్రవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై సరదాగా యానం వెళ్లారు. అనంతరం తిరిగి యానం ఏటిగట్టుపై నుంచి కొవ్వూరు వెళ్తుండగా కోట వద్ద వంతెన వద్దకు వచ్చేసరికి ఎస్ ఆకారంలో ఉన్న వంతెనను గమనించని వారు గోడను ఢీకొన్నారు. ఈ ఘటనలో మోటార్‌సైకిల్ నడుపుతున్న ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న వ్యక్తి చిన్న గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జానీబాషా తెలిపారు.

స్వామిని చూడగ.. మది మురవగ



ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

భక్తులతో శోభిల్లిన వాడపల్లి క్షేత్రం

ఆత్రేయపురం: శ్రీనివాసా.. శ్రీవేంకటేశా అంటూ ఆ స్వామిని భక్తజనం కొలిచింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో శోభిల్లింది. స్వామివారిని వేద పండితులు, అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజాదికాలు చేశారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఏడు ప్రదక్షిణలు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కాలినడకన వచ్చారు. రాష్ట్రంలోని నలుమూలలు నుంచి వేలాది మంది రావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం, ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిత్య ఆరాధనతో అమ్మవారి అనుగ్రహం

- శ్రీపరిపూర్ణానంద స్వామి
- శ్రీపీఠంలో మహాశక్తి యాగం

కాకినాడ రూరల్: నిత్య ఆరాధనతో అమ్మవారి అనుగ్రహం పొందవచ్చని శ్రీపరిపూర్ణానంద స్వామి అన్నారు. రమణయ్యపేట శ్రీపీఠంలో మూడో రోజు మహాశక్తి యాగం ఘనంగా నిర్వహించారు. శనివారం నరదృష్టి పరిహారం కోసం లక్ష నిమ్మకాయల పూజ జరిగింది. అలాగే దేవీ సూక్త రాజమాతంగి దేవి హోమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడో రోజు శ్రీపీఠంలో ఐశ్వర్యంబికా అమ్మవారిని రాజమాతంగి దేవిగా అలంకరించారు. కుంకుమ పూజలో సుమారు 30 వేల మంది మహిళలు పాల్గొన్నారు. శ్రీవరసిద్ధి వినాయక గణపతి ప్రార్థనతో భక్తి సంగీత కార్యక్రమాన్ని ముందుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం ఉంటేనే అన్నీ సాధ్యమవుతాయన్నారు. అమ్మవారిని ఆరాధన చేసేటప్పుడు మన ఎదుట ఆమె రూపమే ఉండాలన్నారు. రాజమాతంగి అమ్మవారిని అందరూ దర్శించుకోవాలని కోరారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని బాణం, విల్లును పరిపూర్ణానంద స్వామి భక్తుల ముందు ప్రదర్శించారు. తొలుత ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మి దివ్య సందేశాన్ని ఇచ్చారు. దుర్గా అవతారం గురించి పలు విశేషాలను చక్కగా వివరించారు. దుర్గారావు బృందంచే సౌందర్య లహరి పారాయణ సాగింది. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.



అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని విల్లును ప్రదర్శిస్తున్న స్వామి పరిపూర్ణానంద



పూజలో పాల్గొన్న భక్తులు

గల్లంతయ్యాడనుకున్న వ్యక్తి ప్రత్యక్షం

అమలాపురం టౌన్: అమలాపురం అగ్నిమాపక సిబ్బంది స్థానిక ఎర్ర వంతెన నుంచి రూరల్ మండలం సమనస లాకుల వద్ద వరకూ కాలువ గట్ల వెంబడి గల్లంతైన వ్యక్తి కోసం శనివారం ఉదయం రెండు గంటల పాటు హైరానాతో గాలించారు. ఎర్ర వంతెన ప్రాంతానికి చెందిన ఎం.ఏడుకొండలు (50) కాలువలో ప్రమాదవశాత్తూ కాలు జారి పడి గల్లంతయ్యాడని అతని కుటుంబీకులు సమాచారం ఇవ్వడంతో అగ్నిప్రమాద సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఓ పక్క కుటుంబీకులు అతని కోసం ఆందోళన చెందుతున్నారు. మరోపక్క అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇదంతా జరుగుతున్న ఉత్కంఠ వాతావరణంలో గల్లంతయ్యాడనుకుంటున్న ఏడుకొండలు ఉన్నపళంగా ప్రత్యక్ష కావడంతో అటు కుటుంబీకులు, ఇటు అగ్నిమాపక సిబ్బంది అవాక్కయ్యారు. తానెక్కడికో వెళ్లి వస్తున్నానని ఏడుకొండలు బదులివ్వడంతో పోనీలే కథ సుఖాంతం అయ్యిందని అందరూ ఆనందించారు.

వ్యక్తికి విద్యుత్ షాక్

అల్లవరం: దేవగుప్తం కాశివారిపేటలో విద్యుత్ పనులు నిర్వహిస్తున్న బొర్రా వంశీ శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్ గురయ్యాడు. కాశివారిపేటలో విద్యుత్ సమస్య తలెత్తడంతో ఇటీవల లైన్‌మెన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి ప్రైవేట్ వ్యక్తి అయిన వంశీని కరెంట్ స్తంభం ఎక్కించి కరెంట్ పనులు చేస్తుండగా, 11 కేవీ వైర్లు తగలి షాక్‌కు గురయ్యాడు. దీంతో వంశీ శరీరం అంతా కాలిపోయి స్తంభం పైనుంచి పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన స్పందించి 108 అంబులెన్స్‌లో అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

వ్యాన్‌ను ఢీకొని ఇద్దరి మృతి



సంఘటనా స్థలంలో పద్మావతి మృతదేహం



శివశ్రీను (ఫైల్)



పద్మావతి (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పాలకొండకు చెందిన జంబలి పద్మావతి (18), తొండంగి మండలం పాత పెరుమాళ్లపురానికి చెందిన కుక్కా శివశ్రీను (20)లు మోటారు సైకిల్‌పై పిఠాపురం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్నారు. గొల్లప్రోలు చెందుర్తి జంక్షన్‌కు వారు చేరుకోగానే గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి గొల్లప్రోలు వెళుతున్న వ్యాన్ చెందుర్తి జంక్షన్ నుంచి వెళ్లేందుకు తిరుగుతోంది. అప్పటికే అక్కడికి చేరుకున్న పద్మావతి, శివశ్రీనులు ఆటోను తప్పించబోయి వ్యాన్‌ను బలంగా ఢీకొట్టారు. జంబలి పద్మావతి అక్కడికక్కడే చనిపోగా, కుక్కా శివశ్రీను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తాళ్లరేవు మండలం కోరంగి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో పద్మావతి బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఎనిమిది నెలల కిందట ఈ కళాశాలలో చేరింది. మృతురాలికి తండ్రి శ్రీనివాస్, అన్నయ్య సంజయ్‌లు ఉన్నారు. వీరిద్దరూ వ్యాన్ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మృతురాలు శుక్రవారం తన తండ్రి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి దసరా సెలవులకు శనివారం ఇంటికి వస్తున్నానని చెప్పింది. మృతుడు శివశ్రీను తండ్రి మణబ్బాయి, ఇద్దరు అక్కలు ఉన్నారు. శుక్రవారం రాత్రి మృతుడు కొత్త బైక్ కొనుక్కోవాలని చెప్పి తన ఫ్రెండ్ దగ్గర మోటారు సైకిల్ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో పై ఇద్దరూ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అందివచ్చిన పిల్లలు మృత్యువాత పడడంతో ఇరు కుటుంబాలు కన్నీరు మున్నీరవుతున్నాయి.